ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి







ఉగాదికి 7219 ఇళ్లు

ఆనందపురం ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇళ్లు

- ☛ ప్రారంభోత్సవ ఏర్పాట్లలో గృహనిర్మాణ శాఖ
- ☛ 96వేల జగనన్న ఇళ్లలో 4550 డ్రాపింగ్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జగనన్న కాలనీల నిర్మాణంలో భాగంగా మొదటి దఫా ఈ ఏడాది ఉగాది మార్చి 22 నాటికి విశాఖ జిల్లాలో 7219 ఇళ్లను ప్రారంభించే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. ఈ ఫేజ్ -1 జగనన్న ఇళ్లలో ఇప్పటికే 4795 పూర్తవ్వగా 2400 వరకూ మార్చి మొదటి వారంలోగా పూర్తిచేసే దిశగా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారులు, మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు తీవ్రస్థాయిలో శ్రమిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఇళ్లను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ఉగాది రోజున ప్రారంభించనున్నందున హౌసింగ్ అధికారులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది.

మరో వైపు లక్ష ఇళ్ల టార్గెట్?

జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, పెందుర్తి, విశాఖ నగరంలోని 7 జగనన్న లే అవుట్‌లలో వివిధ దశల్లో నిర్మాణంలో గల లక్ష ఇళ్లకు సంబంధించి 96,250 ఇళ్లకు ప్రభుత్వం నుంచి కేటాయింపులు లభించాయి. అయితే నిర్మాణ అనుమతులు మాత్రం 90 వేల ఇళ్లకే ఉన్నాయి. వీటిలో 6250 ఇళ్లకు సంబంధించి సందిగ్ధం నెలకొనగా వీటిలో 4550 ఇళ్లకు సంబంధించిన వారిని అనర్హతగా హౌసింగ్ అధికారులు తేల్చారు. వీటికి సంబంధించిన డ్రాపింగ్ ప్రతిపాదనలను తాజాగా హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అంతా సవ్యంగా సాగితే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఇంకా మిగిలిన సుమారు 2వేల ఇళ్లకు అనుమతుల ప్రక్రియను చేపట్టే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నగరంలో 4 అసెంబ్లీ సెగ్మెంట్లకు అదనంగా ఇళ్లు...

పైవేవీ కాకుండా మరో 19వేల ఇళ్లు విశాఖ నగరంలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో పట్టాలు కూడా పేదలకు ఇచ్చేశారు. ఆన్‌లైన్‌లో కొన్ని ఆటంకాలను తొలగించుకుని స్క్రూటినీ చేసేందుకు ఇవి సిద్ధంగా ఉన్నాయి. వాస్తవానికి విశాఖ జిల్లాలో 1.40లక్షల ఇళ్లు ఇవ్వాల్సి ఉండగా పై లెక్కలన్నీ కలిపి చూస్తే 1.25వేల వరకూ వస్తుండగా మరో 24వేల ఇళ్ల కోసం అధికార పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక్కడ హామీలే ఇవ్వబడును

- ◆ సభ్యుల ప్రశ్నలకు పరిష్కారం లేదు
- ◆ ఎన్ఎఓబి సమస్య యథాతథం
- ◆ ఇళ్ల పట్టాల అమ్మకంపై ముందుకు సాగని విచారణ
- ◆ ఎన్నికల నిబంధనల మధ్య నేడు జెడ్‌పి సమావేశం



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు, అధికారాలిచ్చిన సమాధానాలు, హామీలు ఆ సమావేశానికి పరిమితమవుతున్నాయి. తదుపరి చర్యలేవీ పెద్దగా లేకపోవడంతో సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. సభ్యులను సంతృప్తిపర్చేందుకు సమావేశంలో అధికారులు సమాధానమిస్తున్నా, ప్రభుత్వ విధానాలతో ముడిపడిన అంశాలపై కొనసాగింపు ఉండడంలేదు. గతేడాది నవంబరు 26న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అనేక ప్రశ్నలు, సమస్యలు లేవనెత్తారు. వీటిపై సంబంధిత అధికారులు సమయస్ఫూర్తితో సమాధానమిచ్చారు. తప్ప మూడు నెలల్లో జరిగిన పురోగతి కానరావడంలేదు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో మునుపటి సమావేశాల్లో జరిగిన చర్చ కూడా ఈసారి జరిగేలా లేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు కొత్తగా ఎటువంటి హామీలు ఇవ్వడానికి అవకాశంలేదు. అయితే గత సమావేశంలో ప్రభుత్వ యంత్రాంగం వివిధ సమస్యలపై స్పందించి ఇచ్చిన హామీలపై సభ్యులు అడగనున్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ జరిపి, అమ్మకపు పట్టాలను రద్దుచేసి, అర్హులకు ఇవ్వాలని సభ్యుల సూచనపై విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ స్పందిస్తూ ఇళ్ల పట్టాల

మిగతా 2లో..

తుమ్మపాల సుగర్స్‌ను అమ్మొద్దు

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

▸ వార్త 6లో..

మావోయిస్టు నేత అరెస్టు

▸ వార్త మెయిన్ 3లో..

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాగితాలకే పరిమితం : సిపిఐ

▸ వార్త 5లో..



జి-20 సదస్సు నిర్వహణపై చర్చిస్తున్న రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి

జి -20 సదస్సు నిర్వహణకు చర్యలు

రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-విశాఖపట్నం : వచ్చే నెల 28,29 తేదీలలో నిర్వహించబోయే జి-20 సదస్సు నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని రాష్ట్ర ప్రత్యేక ముఖ్యకార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఉడా కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జి-20 సదస్సు నిర్వహణ కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. మార్చి 27వ తేదీన వివిధ దేశాల నుంచి సదస్సుకు వచ్చే ప్రతినిధులకు స్వాగతంపలకడంతో పాటు ఎయిర్ పోర్టు నుంచి వారికి ఏర్పాటుచేసిన హోటల్ వరకు తీసుకెళ్లేందుకు అవసరమైన రవాణా, లైజినింగ్, డెలిగేట్ కిట్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌కు పలు సూచనలుచేశారు. విదేశీ ప్రతినిధులు జిల్లాలో పర్యటించిన సందర్భాలలో భద్రతాపరమైన అంశాలకు సంబంధించిన ఏర్పాట్లు గురించి నగర పోలీసు కమిషనర్

మిగతా 2లో..

కోలాహలంగా ఎమ్మెల్సీ నామినేషన్లు

ఒకే రోజు వైసిపి, టిడిపి, బిజెపి సహ 12 మంది దాఖలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి బుధవారం నామినేషన్ల ప్రక్రియ కోలాహలంగా సాగింది. ఒకే రోజు 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి, టిడిపి, బిజెపి సహ స్వతంత్రులు 9 మంది నామినేషన్లను విశాఖపట్నం జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జునకు సమర్పించారు.

అధికార వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యాన సంపత్ వినాయక టెంపుల్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్లు సమర్పించారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని అడుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడికి రాజన్నదొర, ఐటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కోలా గురువులు, డిప్యూటీ మేయర్లు సతీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్



నామినేషన్ వేస్తున్న టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు

టిడిపి అభ్యర్థి వి.చిరంజీవిరావు నగరంలోని టిడిపి ప్రధాన కార్యాలయం నుంచి కలెక్టరేట్‌గా ర్యాలీగా వచ్చి నామినేషన్ సమర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాజు అచ్చన్నాయుడు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇక్కడ హామీలే ఇవ్వబడును

అమ్మకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ ఎంతవరకు వచ్చిందో, అనర్హుల పట్టాలు ఎన్ని రద్దు చేశారన్న విషయం రహస్యంగానే ఉంది. ఇళ్ల పట్టాలను వేలాది మంది అనర్హులకు మంజూరుచేశారు. అనర్హుల్లో కొందరు తమ పట్టాలను అమ్మకానికి పెట్టిన వ్యవహారం వెలుగులోకి రావడంతో, పట్టాల అమ్మకంపై విచారణ జరిపి, అమ్మకపు పట్టాలను రద్దుచేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. పట్టాలు అమ్ముకున్నవారి ఇళ్ల పట్టాలు రద్దుచేసి అర్హులైన వారికి ఇవ్వాలని జెసికి ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ సూచించారు. అనర్హుల్లో అధికమంది అధికార పార్టీకి చెందినవారు కావడంతో పట్టాల అమ్మకంపై విచారణ మాటలకే పరిమితమైంది.

పాఠశాలల పరిశీలనకు ఏజెన్సీలో ప్రధానోపాధ్యాయులు చెబుతున్న అభ్యంతరాలను జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందిస్తూ పాఠశాలల పరిశీలనకు అభ్యంతరం చెబుతున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలని మంత్రి చెప్పినా అదే సమస్య కొనసాగుతోంది. ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలపై రాష్ట్రస్థాయి అధికారిని నియమిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పారని మంత్రి తెలిపినా, నిర్వాసితుల సమస్యలు అలానే ఉన్నాయి. అనంతగిరి మండలంలో రహదారులు నిర్మించకుండా రోడ్డు నిర్మించినట్లు చూపించి రూ.8కోట్లు డ్రాచేసిన అధికారులపై చర్యలు తీసుకొని, డబ్బులు తిరిగి రాబెట్టాలని జెడ్‌పిటిసి గంగరాజు ప్రస్తావించినా, దుర్వినియోగమైన నిధులు రాబట్టే ప్రయత్నం లేదు.

కోలాహలంగా ఎమ్మెల్సీ నామినేషన్లు

దుర్వినియోగం జరుగుతుందని ఆరోపించారు. మూడు జిల్లాల్లో దొంగ ఓట్లు పెద్ద ఎత్తున నమోదు చేయించారని, వాలంటీర్లను, వెలుగు ఉద్యోగులను ఉపయోగించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కోండ్రు మురళి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పివిఎన్.మాధవ్ బిజెపి నగర కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ సమర్పించారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ, ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో జనసేన పార్టీతో కలిసి ముందుకెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఉత్తరాంధ్రలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు.

స్వతంత్ర అభ్యర్థులుగా పురిపండ శ్రీనివాసరావు, గుండుపల్లి.సతీష్, దండేల ఆనందరావు, కల్లా లోకనాథం, ఈర్లె శ్రీరామమూర్తి, ఆడారి శరత్‌చంద్ర, బలివాడ రామసంతోష్, రాజాన మోహనరావు, గ్రిద్దలూరు విజయ్‌కుమార్ తమ నామినేషన్లు దాఖలు చేశారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి బుధవారం వరకు మొత్తం 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

జి -20 సదస్సు నిర్వహణకు చర్యలు

సిహెచ్.శ్రీకాంత్‌నడిగి తెలుసుకున్నారు. వివిధ దేశాల ప్రతినిధులకు జిల్లాలో టూరిజం ప్రాంతాలైన సబ్ మెరైన్ మ్యూజియం, తొట్లకొండ తదితరాలు సందర్శించు నిమిత్తం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధంగా నగరాన్ని సుందరంగా ఆధునీకరించాలని జివిఎంసి కమిషనర్‌కు సూచించారు. చివరి రోజున ఆరోగ్యాన్ని మెరుగు పరిచే యోగా, మెడిటేషన్ తదితర కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తున్నట్లు శ్రీలక్ష్మికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్, డిసిపి సుమిత్ సునీల్ గరుడ్, టూరిజం డైరక్టర్ మల్లికార్జునరావు, టూరిజం, పోలీసు, రెవెన్యూ, జివిఎంసి, ఎయిర్ పోర్ట్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలిసి విమానాశ్రయానికి వెళ్లి విదేశీ ప్రతినిధుల రాక సందర్భంగా చేపడుతున్న పనులను పరిశీలించారు.

మెడ్లీమెడ్‌తో వ్యాపార నిర్వహణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఫార్మసీ, వ్యాపారాలు, వర్చువల్ పేషెంట్ కేర్ సొల్యూషన్ల కోసం భారతదేశపు అతి పెద్ద డిజిటల్ ఫ్లాట్‌ఫారమ్ అయిన మెడ్లీమెడ్ రిటైల్ ఫార్మసీ సాఫ్ట్‌వేర్, ఫార్మసీ పాయింట్ ఆఫ్ సేల్ సిస్టమ్ మెడ్లీమెడ్ స్మార్ట్ జడ్ ఇఆర్‌పిని ప్రవేశపెట్టినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ జడ్ ఇఆర్‌పి ఫార్మసీల కోసం ఎండ్-టు-ఎండ్ సొల్యూషన్లను అందిస్తుందని పేర్కొన్నారు. క్లౌడ్-ఆధారిత డిజిటల్ సొల్యూషన్ అయిన మెడ్లీమెడ్ స్మార్టెడ్ ఫార్మసీ వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తుందని, సురక్షితమైన కార్యకలాపాలను నిర్వహించుకునేలా వీలు కల్పిస్తుందని తెలిపారు. మరింత సమాచారానికి 9959154371 / 9963980259 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జిఒ 44తో వేల కుటుంబాలకు న్యాయం : ఎమ్మెల్యే తిప్పల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జిఒ 44 ద్వారా గాజువాక హౌస్ కమిటీలోని వేల కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి న్యాయం చేశారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. వైసిపి నగర కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1999లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా గాజువాక హౌస్ కమిటీ వేసినా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జగన్మోహన్‌రెడ్డి జిఒ 44 తెచ్చి న్యాయం చేశారని తెలిపారు. ఈ జిఒ ప్రకారం భూ యజమానుల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 100 గజాల లోపు ఉచితమని, 100 నుంచి 200 గజాల భూమి ఉంటే 50 శాతం డాక్యుమెంట్‌పై ఉన్న తేదీ ప్రకారం రుసుం ఉంటుందని వివరించారు.

వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, 5వేల ఎకరాలు గాజువాక హౌస్ కమిటీ కింద ఉందని, జిఒ 44 ద్వారా 23,500 కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. త్వరలో పంచగ్రామాల సమస్య కూడా పరిష్కారమవుతుందని తెలిపారు.

నలుగురిలో ఒకరికి అధిక రక్తపోటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతీయులు ప్రతి నలుగురిలో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని ప్రజారోగ్య నిపుణులు తెలిపారు. ఇటీవల ముగిసిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ కాన్ఫరెన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలో వైద్యులు, ఉన్నత ప్రజారోగ్య నిపుణులు అనియంత్రిత రక్తపోటు ప్రమాదాలను ఎదుర్కోవడానికి ఉమ్మడి వేగవంతమైన చర్య కోసం ఒక స్పష్టమైన పిలుపును ఇచ్చారని తెలిపారు. చికిత్స చేయకుండా వదిలేస్తే ఆకస్మిక, అకాల మరణాలకు దారితీసే అత్యంత ప్రమాద కారకంగా దీనిని పేర్కొన్నారు. వైద్య సమాజం, సీనియర్ ప్రభుత్వ అధికారులు, పౌర సమాజం ఉమ్మడిగా ఒక కార్యాచరణ ప్రణాళికను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సహకారంతో బీబీనగర్ లోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ (ఎయిమ్స్) మూడు రోజుల వార్షిక సదస్సును నిర్వహించినట్లు ప్రజారోగ్య నిపుణలు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించిన సెమినార్లు, ప్యానెల్ చర్చల్లో నాన్- కమ్యూనికేబుల్ వ్యాధులు, అందుకు దారితీసే వివిధ ప్రమాద కారకాలు అనేవి మొదటి ప్రాధాన్యత కలిగిన ప్రాథమిక ఆందోళనగా గుర్తించాయని పేర్కొన్నారు. 'ఇనస్పెక్షన్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ హెల్త్: వన్ హెల్త్ వన్ ప్లానెట్', నేపథ్యంతో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ యొక్క 50వ వసంతం సందర్భంగా, క్రియాశీలకంగా ఉంటూ మంచి భవిష్యత్తు కలిగిన ప్రజారోగ్య వ్యూహం కోసం భాగస్వాములందరూ ఒకే చోటకు చేరి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అవగాహన లేక, చికిత్స పొందని కారణంగా రక్తపోటుపై బహుళ రంగాల చర్చపై సదస్సు ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

విశాఖ సమస్యలపై...

ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ ఎంవివి,

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విశాఖపట్నం ఎంపి ఎంవివి.సత్యనారాయణ, గోపాలపురం నియోజకవర్గం పరిశీలకులు, ప్రముఖ ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) బుధవారం కలుసుకున్నారు. విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో గల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరిస్తూ జిఒ జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ, జీవీ

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు జి.ధర్మారావు తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తోన్న అన్ని సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాలని వివరించారు. ఇగ్నో ఎ ా బ ్ ా స ై ట ్ https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు పొందే వీలుందని పేర్కొన్నారు. ఫీజులు ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుందని వివరించారు. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీకూడా విశ్వవిద్యాలయం కల్పిస్తోందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ చూడవచ్చని, లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిలు ద్వారా సంప్రదించాలని సూచించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : మత్స్యకార సామాజిక తరగతికి చెందిన కోలా గురువులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడంతో ఫిషింగ్ హార్బర్‌లో బుధవారం మత్స్యకారులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బోటు యజమానులు, మహిళలు, వ్యాపారులు, మూగి రాజు, దుంప ఈశ్వరరెడ్డి, జోగి సుధాకర్, పిల్లా సుభద్రమ్మ, కె.పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి జగన్ పెద్ద పీట : ఎమ్మెల్సీ కల్యాణి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసే నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. బుధవారం ఉదయం వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీల అభ్యర్థుల ఎంపికలో బిసి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. మత్స్యకారులు ఆందోళన చేస్తే చంద్రబాబు తాట తీస్తానన్నారని, జగన్మోహన్‌రెడ్డి మాత్రం మత్స్యకారులకు అధిక ప్రాధానత నిస్తూ ఎమ్మెల్సీలను కేటాయించారని చెప్పారు. గత ప్రభుత్వం 8 మంది బీసీలకు మంత్రి పదవులు ఇస్తే వైసిపిలో 11 మంది బీసీలకు మంత్రి పదవులు దక్కాయన్నారు. సామాజిక న్యాయం జగన్మోహన్‌రెడ్డి పాలనలో మాత్రమే అమలవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లంపల్లి రాజబాబు, విజయ్ చందర్, వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పికొండ వద్ద డిశాలినేషన్ ప్లాంట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి పరిధి అప్పికొండ వద్ద 100 ఎంఎల్‌డి డిశాలినేషన్ ప్లాంట్ నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (ఎపియుఐఎఎమ్‌ఎల్), ఐడిఇ టెక్నాలజీస్ ప్రతినిధులతో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు చర్చలు జరిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 74వ వార్డు దల్లివానిపాలెం, సిద్ధేశ్వరం ప్రాంతాలలో రూ.40లక్షలతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. పనులను నాణ్యతతోచేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఆయా ప్రాంతాల పరిధిలో మిగిలిన సమస్యల పరిష్కారంతో సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొందేశి సత్యరావు, దల్లి పైడికొండ, గొందేశి సత్తిరెడ్డి, అప్పారావు, గొరుసు రామలక్ష్మి, కోన రాజు, కోన రాము, చిన్నరెడ్డి, వార్డు వైసిపి నేతలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మనస్తత్వాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న నరేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థుల మనస్తత్వాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని ఇఎండిపి జిల్లా మేనేజర్ కాకర నరేష్ సూచించారు బుధవారం స్థానిక ఎపి బాలికల గురుకులంలో ఎస్ఇఆర్‌టి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు సృజనాత్మక నైపుణ్యంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని సూచించారు. ఫెసిలిటేటర్ వి.సాయిలక్ష్మి 18వ సెషన్‌లో 'సమస్య పరిష్కార పరిశోధన' అంశంపై విద్యార్థులకు బోధించారు.గురుకులం ప్రిన్సిపాల్ కె రాంబాబు ప్రోగ్రాం ముఖ్యోద్దేశ్యం, వచ్చే నెలలో జరుగనున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో గురించి వివరించారు

సమిష్టిగా కాలనీని అభివృద్ధి చేద్దాం



ఆర్చి పనుల పున:ప్రారంభంలో కాలనీ వాసులు

ప్రజాశక్తి- పెందుర్తి : చేయి చేయి కలుపుదాం, కాలనీని అభివృద్ధి చేసుకుందామని 94వ వార్డు అప్పల నరసింహ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అన్నారు. ఏళ్లతరబడి అర్థాంతరంగా నిలిచిపోయిన ఆర్చి పనులను పూర్తిచేద్దామన్నారు. బుధవారం ఆర్చ్ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటైన తొలినాళ్లలో ఇక్కడ ఆర్చి ఏర్పాటు చేశారని, అయితే అరకొర పనులతో అది నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో కాలనీ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థానికులంతా అప్పల నరసింహనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటై ఒక్కటొక్కటిగా సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. సెక్రెటరీ శ్రీనివాసరావు, సంఘ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు

మద్యం దుకాణం వద్దు!

ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న రామకృష్ణాపురం మహిళలు



మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు, స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ :13వ వార్డు, కేంద్రకారాగారం ఎదురుగా రామక్రిష్ణాపురంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మద్యం దుకాణం ప్రారంభాన్ని స్థానికులు అడ్డుకున్నారు. విశాఖ కేంద్రకారాగారం ఎదురుగా రామక్రిష్ణాపురంలో బిఆర్‌టిఎస్ రోడ్డును ఆనుకొని ఉన్న ఓ వ్యక్తికి చెందిన రేకుల షెడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం మద్యం స్టాక్‌ను తీసుకు వచ్చి షెడ్డులో పెట్టారు. స్థానికులు ఈ విషయం గమనించి అక్కడ ఉన్న ఎక్సైజ్ అధికారులను అడిగారు.

అక్కడ మద్యం షాపు ప్రారంభిస్తున్నట్లు తెలియడంతో జనావాసాల మధ్యం మద్యం దుకాణం వద్దంటూ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులకు, స్థానిక మహిళలకు కొంతసేపు వాగ్వివాదం జరిగింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మహిళలు అడ్డు తగిలారు. దశల వారిగా మద్యాన్ని నిషేధిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, ఇలా కాలనీకొక మద్యం దుకాణం ఏర్పాటుతో విస్తరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. దీంతో అధికారులు షాపు షట్టర్ మూసేసి వెనుతిరిగారు.

కుల వృత్తుల పూర్వవైభవానికి కృషి



వృత్తిదారులకు మంజూరు పత్రాలు ఇస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి ములగాడ : కనుమరుగవుతున్న కులవృత్తులకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చి, వారిని ఆర్థికంగా ఆదుకుని, అభివృద్ధి చెందేలాచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్, అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అన్నారు. బుధవారం పద్మనాభ మండలం ఇసుకల పాలెంలో తెలుకుల కులవృత్తి అయిన నువ్వుల నూనె తయారీ నల్ల నువ్వుల నుండి తెల్ల నువ్వుల పప్పు తయారీ మరియు నువ్వుల పప్పు నుండి నువ్వుల పప్పు, నూనె తయారీ యూనిట్‌ను ప్రారంభించారు, మిషనరీ మోటార్లను ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ కల్లేపల్లి కూర్మనాథ్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల వృత్తిదారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పిఎంఇజిపి పథకం ద్వారా రూ.పది లక్షల నుండి రూ. పాతిక లక్షల వరకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు, కులవృత్తుల పరిపుష్టికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం సిటీ ప్రధాన కార్యదర్శి జామి అప్పలరాజు, పద్మనాభం మండల ప్రధాన కార్యదర్శి అలమండ అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్యాధికారుల శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ .సింహాచలం

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ(స్మయిల్) ఆధ్వర్యంలో పాడి పశువుల్లో ఉత్పాదకత పెంపు, పశు వైద్యుల పాత్ర అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ వై.సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 33 మంది పశు వైద్యులు పాల్గొన్నారు.పాడి పశువుల్లో ఆధునిక పోషణ పద్ధతులు, మేలు రకాలైన పశువుల ఉత్పత్తి, వివిధ రుతువుల్లో పాడి పశువుల యాజమాన్యం, ఆధునిక పద్ధతిలో గొర్రెల, మేకల పోషణ, గ్రామీణ కోళ్ళ పెంపకం, రైతుల ఆదాయం రెట్టింపు చేసే పద్ధతులు, పాల ఉత్పత్తులు, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలపై డాక్టర్ మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, మాదిన ప్రసాదరావు, చంద్రశేఖర్, చలపతి, సతీష్‌కుమార్‌లు పశువైద్యులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా స్మయిల్ అదనపు సంచాలకులు డాక్టర్ వై.సింహాచలం మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను వివరించారు.

మంచి, చెడ్డ స్పర్శలపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : మంచి, చెడు స్పర్శలపై చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు రోజా, ఆదిలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలపై అకృత్యాలు, అఘాయిత్యాలు జరుగుతున్న పరిస్థితుల్లో బాలికలు, యువతులను చైతన్యపరచడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు ప్రేమ, అభిమానంతో కూడిన తల్లిదండ్రుల స్పర్శకు, విపరీత ధోరణులతో కూడిన బయట వ్యక్తుల స్పర్శ తేడాలను స్పష్టంగా వివరిస్తూ, చిరుప్రాయం నుంచే బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం గ్రామంలో టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దువ్వి సురేష్, పొట్నూరు చిన రాము, ఉపాధ్యక్షులుగా ఎస్ అవినాష్, కోశాధికారిగా శంకర్, సభ్యులుగా దాసరి శ్రీను, జి శ్రీను, ఎస్ రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షునిగా పి సాయికుమార్ ఎన్నికైనట్లు పార్టీ నాయకులు పూసర్ల రామారావు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొట్నూరు రాము, టి వెంకటరమణ పాత్రుడు, పి చిట్టిబాబు, కె.అప్పారావు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హిజ్రా దారుణ హత్య

- హతమార్చి పెట్రోల్ పోసి కాల్చిన వైనం

ప్రజాశక్తి- యలమంచిలి రూరల్ : హిజ్రా దారుణహ్యాతకు గురైంది. ఎలమంచిలి జాతీయ రహదారి ఎర్రవరం సమీపంలో ఘర్ దాబా పెట్రోల్ బంక్ వద్ద కాలి వున్న మృతదేహాన్ని బుధవారం ఉదయం 6 గంటల సమయంలో స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ ఎస్‌కె.గఫూర్ సమక్షంలో స్థానిక ఎస్సై వెంకటరావు, పోలీసు బృందంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. జిల్లా ఎస్పీ గౌతమ్ శాలి, డీఎస్పీ శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి పరిస్థితులను పర్యవేక్షించారు. క్లూస్ టీమ్‌తో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు చెప్పారు. వేరే ప్రాంతంలో హత్య చేసి, పెట్రోల్ పోసి కాల్చిన మృతదేహాన్ని ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సిఐ గఫూర్ తెలిపారు. గత నెల 15న ఎలమంచిలి సమీపంలో చెరుకు కాటా వద్ద ఇదే తరహాలో మృతదేహం లభ్యం కావడం, నెల రోజుల వ్యవధిలోనే రెండు హత్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పెందుర్తి రోడ్‌లో దుక్కవానిపాలెం టోల్‌గేటు సమీపంలో విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. 45- 50ఏళ్ల వయస్సు గల పురుషుడు, నీలి రంగు షర్టు ధరించి ఉన్నాడని, హైవే రోడ్డు పక్కనే ఉన్న సిమెంట్ రోడ్డు మధ్యలో మృతదేహాన్ని గుర్తించామని స్థానికులు అంటున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

రెండు ఆలయాల్లోని హుండీల చోరీ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలోని రెండు ఆలయాల్లో మంగళవారం రాత్రి దొంగతనాలు జరిగాయి. కామాక్షమ్మ ఆలయంలో ప్రవేశద్వారం తలుపులను పగులగొట్టి, లోపలికి ప్రవేశించిన దొంగలు ఇనుప హుండీని పగులగొట్టి సుమారుగా రూ.4వేలు నగదు నగదును దొంగలించారు. దుర్గాదేవి ఆలయం బయట వున్న హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ.3వేలు నగదును అపహరించారు. కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు

చెట్టు పైనుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన దొంగల దాదమ్మ (53) తాటిచెట్టు నుంచి కిందపడి మృతి చెందాడు. ఉపమాక పంచాయతీ శివారు కొర్రవానిపాలెం సమీపంలో తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన తుని హాస్పటల్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి శ్రీనివాసరావు తెలిపారు.

మినీ ట్రావెల్ బస్సు దగ్ధం



ఎగసి పడుతున్న పొగ, మంటలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నిలిచి ఉన్న మినీ ట్రావెల్ బస్సు బుధవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ప్రధాన రహదారి పక్కన చాలా రోజుల క్రితం నుంచి నిలిపి ఉన్న బస్సు నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగతో కూడిన మంటలు చెలరేగాయి. ఎగసి పడుతున్న మంటలు ఆర్పేందుకు స్థానికులు, ప్రయత్నించారు. అందిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు.

కాలువల అభివృద్ధికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఐలా చైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి- గాజువాక : ఆటోనగర్ జి బ్లాక్‌లో 450 మీటర్ల సిమెంట్ కాలువల అభివృద్ధి, మరమ్మతు పనులకు ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి(రఘు), కమిషనర్ సూర్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.18లక్షల ఎపిఐఐసి నిధులతో రాసా సంస్థ ఈ పనులను చేపట్టనుంది. ఇప్పటికే ఉన్న కాలువల్లో పూడికతీతలు, శ్మశానవాటిక వైపు నుంచి లింక్ కాలువల అభివృద్ధి వంటి పనులు చేయనున్నట్లు రాసా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాలువల సమస్యకు తాజా పనులతో పరిష్కారం లభించనుందని ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కమిషనర్ సూర్యనారాయణ తెలిపారు. ఆటోనగర్‌లో మిగతా బ్లాకుల్లో రహదారులు, డ్రైనేజీ పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

యువత చొరవకు అభినందన


రోడ్డుపై పడిన చెట్టు కొమ్మలు తొలగిస్తున్న యువకులు

ప్రజాశక్తి- సీతమ్మధార : శంకరమఠం రోడ్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో రోడ్డు పక్కనున్న చెట్టు కొమ్మ హఠాత్తుగా కూలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే మార్గమైనప్పటికీ, మధ్యాహ్న సమయంలో రోడ్డుకు అడ్డంగా భారీ కొమ్మ కూలినప్పటికీ ఎవరికి ఎటువంటి ప్రమాదం, నష్టం వాటిల్లలేదు. అయితే వాహనాలు, పాదచారుల రాకపోకలకు వీలులేనట్లుగా రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమయానికి ట్రాఫిక్ పోలీసులు కూడా లేకపోవడంతో స్థానిక యువత కొంతమంది ముందుకొచ్చి రోడ్డుపై పడిన చెట్టు కొమ్మలను తొలగించారు. వాహన రాకపోకలకు మార్గం సుగమం చేశారు. యువత చొరవను పలువురు పాదచారులు, వాహనదారులు అభినందించారు.

52వ వార్డులో విస్తృత పర్యటన


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : 52వ వార్డు శాంతినగర్, అంబేద్కర్ నగర్, కరాస మెయిన్ రోడ్డు ప్రాంతాలలో బుధవారం జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, ఇతరత్రా సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వేదుల శ్రీను, మారుతి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ , తదితరులు పాల్గొన్నారు.

భెల్ త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో

సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలి

నేడే ఎన్నికలు

ప్రజాశక్తి -గాజువాక : భెల్‌లో ఈనెల 23న జరగనున్న త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలని, బిహెచ్ఇఎల్ సిఐటియు ప్రధానకార్యదర్శి జిటిపి ప్రకాష్ కోరారు. బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, సిఐటియు ప్యానెల్‌లో తనతోపాటు కె.విజయ్‌కుమార్, ఎస్ .అప్పారావు, కె.నారపరెడ్డి, జి.రాంబాబు, పి కనకారావు, పి శివరాం, బి కృష్ణమూర్తి అభ్యర్థులుగా పోటీలో ఉన్నారన్నారు.

త్రిఫ్ట్ సొసైటీలో సిఐటియు ప్యానెల్ విజయం సాధిస్తే సభ్యులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతోపాటు దాచుకున్న డబ్బుపై ప్రస్తుతమున్న దానికంటే అధిక వడ్డీతోపాటు, సభ్యులు తీసుకున్న రుణాలు, డిపాజిట్లుపై వడ్డీ తేడా ఒకశాతం మాత్రమే ఉండేలా చర్యలు చేపడతామన్నారు. సభ్యులకు బీమా సౌకర్యం కల్పిస్తామని, సొసైటీని లాభాల బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సహకార స్ఫూర్తితో సభ్యులకు అత్యవసర రుణాలు మంజూరు. హెచ్‌పిఐపిలోని 700మందిలో500మంది మాత్రమే సభ్యులుగా ఉండగా, కార్మికులందరికీ సభ్యత్వం కల్పిస్తామన్నారు. సమర్థులైన సిఐటియు ప్యానెల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.


పోటీలో ఉన్న సిఐటియు ప్యానల్ అభ్యర్థులు వీరే

హృద్రోగ చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న ఒఎస్‌జి సంస్థ ప్రతినిధి శివ

ప్రజాశక్తి -ఆనందపురం : హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి మండలంలోని బోయపాలేనికి చెందిన ఒఎస్‌జి ఫౌండేషన్ సంస్థ దాతల ద్వారా సమకూర్చిన రూ.25వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబీకులకు బుధవారం అందజేశారు.

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం గొనప పుట్టుగ గ్రామానికి చెందిన లండ సంతోషి అనే మూడేళ్ల బాలిక గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ, స్టార్ పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాలిక గుండె ఆపరేషన్‌కు రూ.ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు నిర్ధారించిన నేపథ్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక తల్లిదండ్రులు తమ బిడ్డ వైద్యానికి సాయం చేయాలని పలు స్వచ్ఛందసంస్థలు, దాతలను సోషల్‌మీడియా ద్వారా అభ్యర్థించారు. బాలిక తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి, నిస్సహాయతపై ఒఎస్‌జి ఫౌండేషన్ కూడా స్పందించి, దాతల ద్వారా విరాళాలను సేకరించి, వచ్చిన మొత్తం రూ.25వేలను బుధవారం ఆసుపత్రిలో బాలిక తల్లిదండ్రులకు అందజేశారు.

మరికొంతమంది దాతలు కూడా సాయం చేశారని ఒఎస్‌జి సంస్థ ప్రతినిధి శివ దళాయి తెలిపారు. బాలికకు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారని, మొదటి ప్రయత్నంలో ఆపరేషన్ ఫెయిలైనప్పటికీ, రెండో ప్రయత్నంలో మళ్ళ ఆపరేషన్ చేశారని, ప్రస్తుతం పాప ఐసియులో ఉన్న చిన్నారికి ప్రాణాపాయం తప్పి కోలుకుంటోందని వైద్యులు చెప్పారనిశివ తెలిపారు. మెరుగైన వైద్యం, కోలుకునేందుకు మరికొంత సమయం పట్టనున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి దాతలు చేదోడుగా నిలవాలని శివ కోరారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం


అల్పాహారం అందజేస్తున్న విజ్డన్ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమౌతున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు విజ్డన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోజూ సాయంత్రం అల్పాహారాన్ని అందజేస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సమయంలో సాయంత్రం వేళ విద్యార్థులు ఆకలి, అలసటతో ఇబ్బందులు పడకుండా వుండేందుకు తమ వంతుసాయంగా ప్రత్యేక తరగతులు నిర్వహించే 25రోజులపాటు రోజూ సాయంత్రం రోజుకొక రకమైన అల్పాహారాన్ని విద్యార్థులందరికీ అందజేస్తామని విజ్డన్ ఫౌండేషన్ సంస్థ అధినేత తలశిల విజయ్‌మోహన్, ఆయన సతీమణి విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం రాజబాబు, ఎ.జయప్రద, విద్యార్థుల కమిటీ ఛైర్మన్ బుడుమూరు మీనా, కో ఆప్షన్ సభ్యులు పిల్లా సూరిబాబు, కింజరాపు భరత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నర్సింగరావు సత్తా

ప్రజాశక్తి-ఉక్కునగరం : హరియాణాలో జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో అగనంపూడికి చెందిన స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుడు చట్టి నర్సింగరావు 4X100 మీటర్ల పరుగు పందెంలో సత్తాచాటి రెండోస్థానంలో నిలిచాడు. గతంలోనూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో నర్సింగరావు తన ప్రతిభను నిరూపించుకుని పతకాలను సాధించడంతోపాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. హరియాణాలో ఈనెల 18న జరిగిన పోటీల్లోనూ రాణించి, రెండోస్థానంలో నిలవడం ద్వారా రజత పతకాన్ని కైవసం చేసుకోవడంతోపాటు జాతీయస్థాయిలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేరును నిలబెట్టగలిగాడు. 28 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి, పతకాన్ని సాధించడంపై పలువురు నర్సింగరావును ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.


పతకాన్ని అందుకుంటున్న నర్సింగరావు

ఆస్తి బదిలీ అనుమతి పత్రం ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : హౌస్ కమిటీ బాధితులందరికీ జిఒ 71 ప్రకారం ఆస్తి బదిలీ అనుమతి పత్రం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి శ్రీరామ్మూర్తి బుధవారం ప్రకటనలో కోరారు. జిఒ 301 ప్రకారం సర్వే జరిపి పట్టాలు లేని వారికి మంజూరు చేయాలని కోరారు. 65, 66, 67, 70 వార్డుల పరిధిలోని ప్రజలకు పట్టాలు పొందకపోతే హక్కు పత్రం, లేదా ఆస్తి బదిలీ పత్రం కలెక్టర్ అందజేయాలని కోరారు. 301 ప్రకారం పట్టాల పొందిన వారికి జిఒ 225 అమలు చేస్తే గాజువాక ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

2 నుంచి అనంతుని కల్యాణోత్సవం

ప్రజాశక్తి- పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో వెలసిన అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను బుధవారం కుంతీ మాధవస్వామి ఆలయంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు ఆవిష్కరించారు. వచ్చేనెల రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు అనంతుని కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఉత్సవ కమిటీలను ఎంపిపి కోరారు.కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 25వ వార్డు సీతంపేట, గణేష్‌నగర్ పార్వతీశ్వరాలయం 33వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం మహా అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్ అన్నదానాన్ని ప్రారంభించగా, రెండు వేల మందికిపైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి పద్మ వెంకట్, ప్రధాన అర్చకులు శివాజీ శర్మ, ప్రిలి అప్పలనాయుడు, విటి. నాయుడు, బాలకృష్ణారెడ్డి, మహేష్, గంగిరెడ్డి, అమ్మన్నాయుడు, సతీష్, ముప్పల రాజారావు, బాల మురుగన్, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజగోపాలరావుకు ఘననివాళి


చీరలు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : 87వ వార్డు వైసిపి నేతల ఆధ్వర్యంలో వడ్లపూడిలో మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు వర్ధంతిని నిర్వహించారు. రాజగోపాలరావు చిత్రపటానికి వైసిపి మహిళా నేత పేడాడరమణికుమారి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడా శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వడ్లపూడిలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణికుమారి, శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి 1952-84 మధ్యకాలంలో ఆరుసార్లు ఎంపిగా ఎన్నికై, ప్రజాసమస్యల పరిష్కారానికి ఆదర్శ పార్లమెంటేరియన్‌గా కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, గొనప సన్యాసినాయుడు, పూడి ఆనంద్, దబ్బాలు సత్తిబాబు, మార్పు దానయ్య, డి.అప్పుడు, బుల్లెట్ రమణ, మార్పు గోవిందా, ఆడారి శ్రీను,సబ్బవరపు పార్వతి పాల్గొన్నారు.

మాధవధార : కళింగుల అభ్యున్నతికి బొడ్డేపల్లి రాజగోపాల్ చేసిన సేవలు ఎనలేనివని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు, వైసిపి మహిళా నేత పేడాడ రమణికుమారి అన్నారు. రాజగోపాల్ 31వ వర్ధంతి సందర్భంగా మాధవధార ఉడాకాలనీలోని హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కళింగ సామాజిక వర్గ సమస్యలపై చర్చించి వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, సనపల రవీంద్ర భరత్, బగాది విజయ్, దామోదరరావు, సనపల శ్రీకాంత్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాగితాలకే పరిమితం

- ★ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- ★ మార్చి మొదటి వారంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబల్ సమావేశం
- ★ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి- కె.కోటపాడు, కశింకోట

బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు కలగా మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తుందని, అది కాగితాలకే పరిమితమైందని తప్పా ఆచరణలో ఏ ఒక్క పనీ మొదలు పెట్టలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం రామకృష్ణ



సుజల స్రవంతి మ్యాప్‌ను పరిశీలిస్తున్న రామకృష్ణ



భూదేవి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతం వద్ద సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు

నేతృత్వంలో సిపిఐ ప్రతినిధి బృందం కసింకోట మండలం తాళ్లపాలెం వద్ద పోలవరం 8వ ప్యాకేజీ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను, కె.కోటపాడు మండలంలో సుజల స్రవంతి భూదేవి రిజర్వాయర్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. దీనికి ముందు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పోలవరం కెనాల్ అనకాపల్లి డివిజన్ ఇంజనీర్ పి.ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. పోలవరం పూర్తయితే ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలు, పట్టణాలకు తాగునీరు లభిస్తుందని, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. కర్ణాటకలో ఎన్నికల దృష్ట్యా అక్కడ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి కేంద్ర మోడీ ప్రభుత్వం రూ.2900 కోట్లు కేటాయించిందని, కాని జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి గత నాలుగేళ్లగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.2900 కోట్ల కూడా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శంకుస్థాపన చేసిన నేటికి 15 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ పనులు మొదలుపెట్టకపోవడం దారుణమన్నారు. మార్చి మొదటి వారంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జెవి సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, అక్కినేని వనజ, జి.ఈశ్వరయ్య, డేగ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు ఎ.విమల, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, డిసిహెచ్.రాజబాబు, జి.గురుబాబు, బి.సుబ్బలక్ష్మి, ఆర్.అప్పలరాజు, వేచలపు కాసుబాబు, గొర్ల దేవుడుబాబు, ఇల్లాకు రాము, రెడ్డి అప్పలనాయుడు, శ్రీనివాసనాయుడు, బొంతపల్లి రామారావు, సత్తిబాబు, కొండలరావు, ఫణీంద్ర, రాజు, నరేష్, పాల్గొన్నారు.



నెలవారీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి గౌతమిశాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి గౌతమి శాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ గౌతమి శాలి స్పష్టం చేశారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి నిర్మూలన జిల్లాగా చేసే క్రమంలో ప్రణాళిక బద్ధంగా తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. శిక్ష అనుభవించి బయటకొచ్చిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రాత్రి పగలు గస్తీలు ముమ్మరం చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పిడిజె కోర్టు స్పెషల్ పిపివై తారక రామారావు పోలీస్ అధికారులు విధి నిర్వహణలో అరెస్టులు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలు తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్, క్రైమ్ అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం డిఎస్‌పి ప్రవీణ్ కుమార్, అనకాపల్లి ఇన్‌ఛార్జి డిఎస్పి మల్ల మహేశ్వరరావు, పరవాడ డిఎస్‌పి పి శ్రీనివాసరావు, ఆర్ముడు రిజర్వ్ డిఎస్పి పి నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు నరసింహారావు, అప్పలనాయుడు, చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌సి అర్జునకు ప్రశంసా పత్రం

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.అర్జునకు అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి సాలి బుధవారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈనెల 4న బుచ్చయ్య పేట పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట పశువులు దొంగతనాలు రెండు జరగ్గా, ఆ కేసులో ముగ్గురు వ్యక్తులను, గుడి దొంగతనాలకు పాల్పడిన మూడు కేసులలో నలుగురు వ్యక్తులను మొత్తము ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసిన అర్జునను జిల్లా నెలవారీ నేర సమీక్ష సమావేశంలో అభినందించారు.

115 రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి


తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్‌ఎఒబి ప్రధాన గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 115వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేవీ నిర్మాణంతో తమకు ఉపాధి కరువైందని, తమ జీవనాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికి ఎంత అన్యాయం జరిగిందో చూడకుండా, కొన్ని గ్రామాలను మాత్రమే గుర్తించి జీవన భృతి కల్పిస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. దీంతో కొప్పుగొండపాలెం, వాడపాలెం, చిన్న కలవలపల్లి, కొత్తపేట, గోవింద పాలెం, నేవీ కాలనీ గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అందరినీ సమానంగా చూడాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

అధికారమా.. మజాకా

- రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు
- పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు తొడగని వైనం



రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి లేని ముసుగు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల కటౌట్లు తొలగింపు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న అధికారులు అధికార పార్టీకి భయపడుతున్నారో, మరి ఏదైనా కారణమో తెలియదు గాని మండలంలోని వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు వేయలేదు. ఇక్కడున్న రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు, రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వేయడంపై చూసి ప్రయాణికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఉన్న రాజకీయ పార్టీల కటౌట్లు గ్రామస్థాయిలో పంచాయతీ అధికారులు తొలగిస్తున్నారు. కాని వడ్డాదిలో వైఎస్ విగ్రహానికి ముసుగు వేయకుండా వదిలేసిన అధికారుల తీరు మండల వాసులు చర్చించుకుంటున్నారు.

నేడు సబ్బవరం మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న గురువారం ఉదయం10 గంటలకు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ రమేష్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం

విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

విజ్ఞానంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ రవి పటాన్ శెట్టి అన్నారు. స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధ గురువారాల్లో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, వీటి ద్వారా భావిభారత శాస్త్రజ్ఞులు తయారవుతారని చెప్పారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఉత్సాహాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వ్యవసాయం, పర్యావరణ, సౌరశక్తి, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, భౌతిక విద్య, గణిత శాస్త్రాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని విద్యార్థులను అభినందించారు. ఈ జిల్లా సైన్స్ ఫెయిర్‌లో 89 పాఠశాలలకు చెందిన 120 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్, ఎంఈఓ దివాకర్, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు తన ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థిని

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

చిరుధాన్యాలతోనే అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ అన్నారు. తుమ్మపాల శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి కార్యాలయంలో నాబార్డ్ సహకారంతో బుధవారం అంతర్జాతీయ చిరు ధాన్యాల మహోత్సవం సందర్భంగా 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. సంస్థ కార్యదర్శి జోగినాయుడు మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ ఆహార పదార్థాలను తయారు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. చిరుధాన్యాల ఉత్పత్తులను అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాస్త్రవేత్తలు

ఆశా కార్యకర్తలతో పారిశుధ్య పనులు

వైద్యాధికారి తీరుపై ఆశాలు, యూనియన్ నాయకుల మండిపాటు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య పనులను ఆశా కార్యకర్తల చేత మంగళ, బుధవారాల్లో వైద్యాధికారి చేయించారని ఆశా వర్కర్లు, యూనియన్ నాయకులు ఆరోపించారు. ఆసుపత్రి భవనం మొత్తం చీపురుతో ఊడ్చడం, కాలువలు కడిగించడం, ఇతర సామగ్రి, బరువును మోయించడం వంటి పనులు చేయించినట్లు వారు తెలిపారు. వాస్తవంగా గ్రామాల్లో గర్భిణులను గుర్తించడం, వారికి వైద్య సలహాలు, సూచనలు ఇస్తూ డెలివరీ అయ్యే వరకు వ్యాక్సిన్లు ఇంజక్షన్లు మందులు ఇప్పించడం, డెలివరీ అయిన తర్వాత తల్లితోపాటు పిల్లలకు ఏడాదిన్నర వయసు వచ్చే వరకూ టీకాలు, ఇంజక్షన్లు ఇస్తూ తల్లి పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు తోడ్పాటు అందించడం, ప్రజలు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులకు రెఫర్ చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని ప్రజల్లో అవగాహన పెంచడం వంటి పనుల నిమిత్తం ప్రభుత్వం ఆశా వర్కర్లను నియమించింది. ఇందుకు విరుద్ధంగా తాళ్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి పారిశుధ్య, ఇతర పనులు చేయించడంతో ఆ పనులు తమవి కావని తెలియజేస్తే తమపై దురుసుగా ప్రవర్తించినట్లు ఆశాలు ఆరోపించారు. చెప్పిన పనులు చేయకపోతే ఇంటి వద్ద ఉండిపోవాలని అంటున్నారని పేర్కొన్నారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన వైద్యులు ఈ పనులు వేరేవారితో చేయించేవారని తెలిపారు. ఎఎన్ఎం దగ్గరుండి తమతో ఈ పనులు చేయించడంపై అన్యాయమన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల యునియన్ జిల్లా అధ్యక్షులు కాకర శాంతి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల చేత పారిశుధ్య పనులు చేయించడంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తాళ్ళపాలెం వైద్యాధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



చీపుర్లతో తుడుస్తున్న ఆశా కార్యకర్తలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని వాడ్రాపల్లి జెడ్పీ హైస్కూల్లో మ్యాజిక్ బస్సు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన లిట్రసీ, న్యూమ్రసీ కాంపిటేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు చేతుల మీదగా బుధవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నేడు అందిస్తున్న విద్యాబోధన వారి సామర్థ్యానికి మచ్చుతునక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రతన్ రాజు, మ్యాజిక్ బస్సు సంస్థ అకాడమిక్ ఎడ్యుకేటర్ పి.ఆనంద్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాత స్తంభాల మార్పిడి కారణంగా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడినట్టు ఏపీ ఈపీడీసీఎల్ డిఈ ఎస్ రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గాంధీ బొమ్మ సెంటర్, రింగ్ రోడ్డు, పెరుగు బజారు చిన్న వీధి, చాపల మార్కెట్, నాయుళ్ల వీధి, ఆమంచి వారి వీధి, జీవి కోటేశ్వరరావు వీధి, జీవీఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు సబ్బవరం మండలంలో....

సబ్బవరం : సబ్బవరం-2 సెక్షన్ పరిధిలోని 33/11 కెవి, అంతకాపల్లి సబ్ స్టేషన్-11కెవి, గుల్లేపల్లి రూరల్ ఫీడర్ల మరమ్మతులు కారణంగా ఈ నెల 24న శుక్రవారం విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని సబ్బవరం సబ్ డివిజన్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్ బి. నిరీక్షణ్ అంబేద్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజుఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, దుడ్డువాక, కిల్లివానిపాలెం, రాపర్తివానిపాలెం, మర్రిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటంలో భాగమే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని మూలపేట గ్రామంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ విధానంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై దాడులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పలు ఇసుక ర్యాంపుల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై దేవరాపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లును స్థానిక పోలీసులు మంగళవారం రాత్రి నాలుగు పట్టుకున్నారు. బుధవారం రాత్రి వరకు స్థానిక పోలీసులు ఈ సమాచారం తెలియజేయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పట్టుబడిన ట్రాక్టర్లు

తుమ్మపాల సుగర్స్‌ను అమ్మొద్దు

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల సహకార సుగర్ ఫ్యాక్టరీని అమ్మకం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.450 కోట్లకు పైగా ఉన్న ఫ్యాక్టరీ ఆస్తులను అంచనా వేసేందుకు ప్రభుత్వం లిక్విడెటర్‌ను నియమించిందని పేర్కొన్నారు. ఆస్తుల అంచనా వేసిన తరువాత ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టాలని చూస్తుందని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు తుమ్మపాల సుగర్‌ను అమ్మకం, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌ను నిలిపివేయడం ద్వారా వైసిపి ప్రభుత్వం నమ్మకద్రోహానికి పాల్పడిందన్నారు. అమ్మకపు ఆలోచన విరమించుకొని మూతవేసిన మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. అమ్మకానికి సిద్ధపడుతున్న ప్రభుత్వ చర్యలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డెయిరీ డైరెక్టర్ గేదెల

రామాలయం ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని ఐతంపూడి శివారు పైడమ్మపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని బుధవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, కొలిమల్ల అచ్చంనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ మండపం నిర్మాణానికి సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దాడ నాయుడు బాబు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, బుచ్చయ్యపేట మాజీ సర్పంచ్ సుంకర సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, స్థానిక నాయకుల ముచ్చకర్ల మహాలక్ష్మి నాయుడు, అప్పన పైడినాయిడు తదితరులు పాల్గొన్నారు.

చింతపాకలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని చింతపాక గ్రామంలో సర్పంచ్ గోలజాన శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులను నిర్వహించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టారు.

చెరువు అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో తమ్మయ్య చెరువు అభివృద్ధి పనులను జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఇటీవల గ్రామానికి చెందిన గణపతిరాజు అప్పలరాజు వంశీయులు సుమారు 50 లక్షల రూపాయల నిధులతో ఆలయాన్ని నిర్మించారు. ఆలయానికి ఎదురుగా గల చెరువును తమ సొంత నిధులతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పడాల నాగభూషణం, కేపి అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఐతంపూడి సర్పంచ్ పెద్దాడ నాయుడుబాబు గుడాల ఆనంద్ పాల్గొన్నారు.



చెరువు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి రాంబాబు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ట్రస్టు అందజేసిన మెటీరియల్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని తోటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు శ్రీఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కటీ రూ.200 విలువజేసే మొత్తం 130 పుస్తకాలను విద్యార్థులకు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరిశెట్టి భాస్కరరావు, ట్రస్టు సభ్యులు గెడ్డం వెంకటరావు, పేర్ని దుర్గాప్రసాద్, గెడ్డం సూర్యనారాయణ, కాకి అప్పారావు, వానపల్లి అప్పలరాజు, నూకలక్ష్మి, నారాయణ, వీరబాబు, సూరిబాబు, నమ్మశివాయ, గోవింద్, పేర్ని సముద్రాలు, బొడ్డేటి శ్రీనివాస్, ఆర్ కె మాస్టర్, కాండ్రేగుల వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ముసిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు డబ్బురి కన్నయ్య, రవణమ్మ దంపతులు, కన్నయ్య బ్రదర్స్ బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పరీక్ష సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉదయభాస్కర్, కన్నయ్య కుమారుడు డబ్బురి సన్యాసిరావు, పాఠశాల ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, కే.సత్యరావు, సుకన్య, పద్మావతి, భవాని, పిడి అప్పారావు, విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి నాగేశ్వరరావు, సిరపరపు నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న కన్నయ్య కుటుంబ సభ్యులు

తెలుగు భాష పట్ల అభిమానం ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగు భాష పట్ల ప్రతి ఒక్కరు అభిమానం కలిగి ఉండాలని ఇస్కాఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్ల మాధవరావు, పట్టణ కార్యదర్శి వై మాలతి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విద్యాధరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జూనియర్ విభాగంలో అమత, దీప్తి, సౌమ్య, శ్రీ గీతికలు, సీనియర్స్ విభాగంలో యశస్విని, అమూల్య, హాసినిలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

వైభవంగా వెంకన్న పెళ్లి రాట

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న స్వామి వారి వార్షిక కల్యాణోత్సవములకు సంబంధించి బుధవారం భక్తుల సమక్షంలో వైభవంగా పెళ్లి రాట వేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, ఇల్లింద వెంకట గోపాలాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా పెండ్లిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ, మార్చి 2న సాయంత్రం అంకురార్పణతో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని, అదే రోజు రాత్రి తిరువీధి సేవ, 3న ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని తెలిపారు. 4, 5వ తేదీలలో రాత్రి స్వామివారి తిరువీధి సేవ, 6న మధ్యాహ్నం సిహెచ్ లక్ష్మీపురం గ్రామంలో స్వామివారి తోటలో తోట ఉత్సవము నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 7న ఉదయం ఆలయంలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పిటిసి కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, యువి శ్రీనివాసరావు సిద్దాబత్తుల కృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పురోహితులు



పరీక్షిస్తున్న వైద్యులు

220మందికి నేత్ర వైద్య పరీక్షలు

పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో స్థానిక భారత్ నిర్మాణ సేవా ట్రస్ట్ అధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరం విజయవంతం అయ్యింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ ఎడ్ల కళావతి ప్రారంభించారు. 220 మందికి పరీక్షలు నిర్వహించి 70 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం తరలించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గౌరీపట్టపు మహేష్, కుక్కర మోదకొండ, సిహెచ్ మధు, జాగాని ఈశ్వరరావు ,మణికంఠ, పశకడుగుల సూరిబాబు, పేలూరి కృష్ణ, కుంచా మధు, ఎస్.చందు, కొప్పాక రాంకీ, గోవింద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది నాగలక్ష్మి, హరిచందన, క్యాంప్ ఆర్గనైజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో పఠనాశక్తి

ప్రజాశక్తి-మాకవరపాలెం: పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో పఠనాశక్తి పెరుగుతుందని మాకవరపాలెం ఎంఈవో నగేష్ తెలిపారు. గౌతిమి లలితాకళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పోటీల్లో భాగంగా బుధవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు రంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుందర్ రావు, శేషగిరిరావు, రుత్తల నారాయణమూర్తి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో జీ.కోడూరు గ్రామంలో కొండగెడ్డ పై నిర్మించిన అక్రమ కట్టడాలను నిలిపేయాలని ఇరిగేషన్ జెఈ రవికుమార్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జి.కోడూరు గ్రామానికి ఆనుకుని ఉన్న కొండగెడ్డను ఆక్రమణ చేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై టీడీపీ నాయకులు స్పందనలో పిర్యాదు చేశారన్నారు. దీనిలో భాగంగానే గత వారం రోజులుగా సర్వే చేసి 30 మంది ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించాన్నారు, వీరందరికీ బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కలిసి నోటీసులు జారీ చేశామన్నారు. వారం రోజుల్లో నిర్మాణాలు తొలగించాలని తెలిపారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 23న, కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 24న విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎ ఈ నందన్ ఓ ప్రకటన లో పేర్కొన్నారు. ఆయా సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాలలో సాంకేతిక లోపాలను సరి చేయడం కోసం ఉదయం 9 గంటలకు సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు వివరించారు. రావికమతం పరిధిలో చిన పాచిల, గుమ్మాలపాడు, గొంప, గుడ్డిప, మట్టవాని పాలెం, మరుపాకలతో పాటు రావికమతం మండల కేంద్రంలోను విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో కుడా కొత్తకోట గ్రామంతో పాటు కన్నంపేట, జే. నాయుడుపాలెం, దొండపూడి, కొత్తపట్నం, గంపవానిపాలెం, చీమలపాడు తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

చోద్యం సొసైటీలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో చోద్యం కో ఆపరేటివ్ బ్యాంక్ సొసైటీలో జిల్లా బ్యాంక్ డిసిసి బ్యాంక్ అధికారి పివివిఎస్.నాయుడు, ఆప్కో డిపిడిఎం సొసైటీ డెవలప్‌మెంట్ జివిఎస్ఎన్.రాజు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి బ్యాంక్ అధికారి నాయుడు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఉన్న 98 బ్యాంకుల్లో పలు బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయని, ఈ మేరకు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

విభిన్న ప్రతిభా వంతులకు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం: మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు చోడవరం పట్టణానికి చెందిన 4 జి ఆర్ ట్రస్ట్ అన్నపూర్ణ, వడ్డాదికి చెందిన హెల్పింగ్ హార్ట్స్ డైరెక్టర్ తలారి అశోక్ కుమార్, సకురు ఫౌండేషన్ డైరెక్టర్ సకురు కోటేశ్వరరావుల ఆర్థిక సహాయంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ, మండలంలో 94 మంది విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశామని ఆమె తెలిపారు. ఈ మధ్యకాలంలో చోడవరం ఫోర్ జిఆర్ ట్రస్ట్ నిర్వాహకులు రావికమతం మండలం దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రిని అందించారన్నారు. ప్రస్తుతం రూ.20వేల విలువైన స్టడీ మెటీరియల్ అందించడం శుభ పరిణామం అని ఆమె కొనియాడారు. ఫోర్ జి ఆర్ ట్రస్ట్ డైరెక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, గతంలో మండలంలో దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, బోధన సామాగ్రి స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు, ఫోర్ జి ఆర్ ట్రస్ట్ సభ్యులు శివ, రాజకుమార్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అప్పల నాయుడు, పాపారావు, అన్నపూర్ణ, నాగమణి, మాధవి, పద్మావతి, జయప్రభ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ ఇస్తున్న హెచ్ఎం, టీచర్స్



మాట్లాడుతున్న ఆర్క్ ప్రసాద్

వృద్ధులపై చిన్నచూపు సరికాదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ప్రగతి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, ఆర్క్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆర్క్ సంస్థ డైరెక్టర్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ, ఏజ్ కేర్ ఫౌండేషన్ వృద్ధాప్యంలో ఉన్న వారికి అందిస్తున్న సేవలను వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న వారిని పిల్లలు చిన్నచూపు చూడడం. మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి గెద్దం విజయలక్ష్మి, ఆర్డీడివి సంస్థ కార్యదర్శి ఆడారి సూరిబాబు, వికాసవాణి సంస్థ కార్యదర్శి రెళ్ళ జగ్గారావు పాల్గొన్నారు.

గ్రావెల్ వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో ఎంకె.పట్నం శివారు గ్రామం పెదపేట రెవెన్యూ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతుండగా మంగళవారం అర్ధరాత్రి జేసిబి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైన్స్ ఎడి రవివర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెదపేట రెవెన్యూ పరిధిలో జేసిబితో తవ్వకాలు జరుపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.



పట్టుబడ్డ జేసిబి, ట్రాక్టర్లు

పాఠశాలలకు టైల్స్ తరలింపు

ప్రజాశక్తి-రోలుగుంట: నాడు నేడు పథకంలో రెండో విడత పాఠశాలల్లో నాలుగింటికి టైల్స్ మంజూరయ్యాయి. వీటిలో బిబి.పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, జానకీరాంపురం, జెపి.అగ్రహారం, గుర్రాలపాలెం ఎంపిపి పాఠశాలలు ఉన్నాయి. ఎంఇఒ సాయిశైలజ ఆదేశాల మేరకు సిబ్బంది ఆయా పాఠశాలలకు టైల్స్ తరలించారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి హామి పనులు తప్పనిసరిగా కల్పించాలని అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం క్షేత్రస్థాయి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో ఎస్సీ, ఎస్టీలకు సుమారు 2000 జాబు కారులు మాత్రమే ఉన్నాయని, డోర్ టు డోర్ సర్వే చేసి మిగిలిన వారికి జాబ్ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ పనులతో పాటు, రైతుల వ్యక్తిగత పనులను కూడా గుర్తించి చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలకు రోజువారి వేతన కూలి రూ.257 వచ్చే విధంగా పని కల్పించాలని సూచించారు. ఉదయం 7 గంటలకే పనులు చేపట్టి అటెండెన్స్ రిపోర్టులను సకాలంలో పంపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కాశి, టిఎ మోహన్, సిఒ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని దారమఠం మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయంకు రూ.3.27లక్షల ఆదాయం వచ్చింది. ఈ మేరకు బుధవారం దేవాదాయశాఖ అధికారులు లెక్కింపు చేపట్టారు. మహాశివరాత్రి మూడు రోజుల పాటు హుండీ, దర్శన టిక్కెట్లు, ఇతర ఆదాయం 3.27లక్షలు వచ్చినట్టు దేవాదాయశాఖ ఈఓ. మురళీ తెలిపారు.



పనులు చేయిస్తున్న ఇఒపిఆర్‌డి

చెరువులో చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి -యస్.రాయవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాలలోని చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు ఈవోపిఆర్‌డి సత్యన్నారాయణ తెలిపారు. బుధవారం కొరుప్రోలులో ఊరచెరువు లో చెత్తా చెదారం తొలగింపు చేపట్టామన్నారు. చెరువు చుట్టూ పచ్చదనం పరిశు భ్రంతో పాటు ప్రజలు వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో బెంచీల ఏర్పాటు చేసి, చెరువును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి రామలక్ష్మి ఉన్నారు.

గృహ సారథుల నియామకంపై అసహనం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో తమకు తెలియకుండా గృహ సారుదుల నియామకం పై వైసిపి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ వార్డు మెంబర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నక్కపల్లిలో బుధవారం విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. నక్కపల్లిలో టిడిపి కార్యకర్తలను గృహ సారుదులుగా నియమించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది చాలా సిగ్గు చేటన్నారు. నక్కపల్లి మేజర్ పంచాయతి ఎన్నికల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ నాయకత్వంలో సర్పంచ్ తో పాటు మొత్తం 14 వార్డు సభ్యులు, రెండు ఎంపీటీసీ స్థానాలను కూడా కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. పార్టీ తరపున గెలిచిన క్యాడర్‌కు తెలియకుండా గృహ సారదులని నియమించడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ బలంగా ఉన్న నక్కపల్లిలో కొంత మంది వ్యవహార శైలితో పార్టీ పరువు పోతుందని, పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ వీసం రాజు ,వార్డు సభ్యులు అల్లాడ కొండ, బాబ్జి, బంగార్రాజు, సురేష్, సత్తిబాబు, ముద్దా శ్రీను, నానాజీ, కొల్నాటి తాతాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రమాప్రభ గెలుపునకు ప్రచారం


డుంబ్రిగుడలో ప్రచారం

ప్రజాశక్తి-రాంబిల్లి :ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపర్చిన కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రం రాంబిల్లి పంచాయతీలో ప్రజాసంఘాల నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.నారాయణరావు, సిహెచ్.శివాజీలు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చోడిపల్లి గంగరాజు, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.నూకన్న, సిఐటియు నాయకులు డి.కాకియ్య తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేముడు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం గ్రామాలలో బుధవారం ప్రజా సంఘాల నాయకులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ప్రజా సమస్యలపై గొంతెత్తే రమాప్రభను శాసన మండలికి పంపించాలని కోరారు.


కె.కోటపాడులో..


రాంబిల్లిలో...

డుంబ్రిగుడ:పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ స్థానిక మండల కేంద్రంలో సిఐటియు, గిరిజన సంఘం నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలతో పాటు కార్మిక కర్షకుల కోసం పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో గళ మెత్తుతున్నారన్నారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.


దగ్ధమైన యంత్రం

పీచు పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామంలోని పీచు పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారు సుమారు ఒంటి గంట సమయంలో శ్రీ శ్రీనివాసా క్వాయర్ ఇండస్ట్రీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పీచు బేళ్ళు కట్టే యంత్రం పూర్తిగా దగ్ధమయింది. యలమంచిలి అగ్నిమాపక అధికారి డి.రాంబాబు, నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది యం.రాజశేఖర్, జి.రాము, ఏ రామారావు, యం. అప్పారావులు ఏడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు నలభై లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పిన్నంరాజు సత్యన్నారాయణరాజు తెలిపారు.


మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని జి.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. చోడవరంకు చెందిన 4 జిఆర్ జాయినింగ్ హాండ్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్వర్యంలో విద్యార్థులకు వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఈవి ఎస్ అన్నపూర్ణ, సభ్యులు సకురు కోటేశ్వరరావు, కిషోర్ కుమార్, శివ, సతీష్, అశోక్, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

కత్తితో వాలంటీర్ దాడి

ముగ్గురు వ్యక్తులకు గాయాలు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలోని ఓ వాలంటీర్ కత్తితో దాడి చేసిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.వివరాలు.. మండలంలో లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన వాలంటీర్ పోతల కొండబాబు గ్రామంలో మాంసం దుకాణం నడుపుతున్నాడు.మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై మాకవరపాలెం వస్తున్నారు. వాలంటీర్ నిర్వహిస్తున్న మాంసం దుకాణం వద్ద కుక్కలు అడ్డు రావడంతో ముగ్గురు యువకులు బైక్ పై నుంచి కిందకు పడిపోయారు. దీంతో సదరు యువకులు, వాలంటీర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహించిన వాలంటీర్ చేతిలో ఉన్న మాంసం కత్తితో యువకులపై దాడి చేశాడు. ఈ దాడిలో కన్నూరు సత్తిబాబు, లగుడు సత్తిబాబు, కన్నూర్ ఆనంద్‌లు గాయపడ్డారు. బాధితులను 108లో నర్సీ పట్నం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. ఈ విషయం గ్రామానికి చెందిన పెద్దలు బయటికి రాకుండా రాత్రి 12 గంటల వరకు చర్చలు జరిపారు. చివరకు స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.


గాయపడ్డ బాధితుడు

కోళ్ల పరిశ్రమ కుదేలు

-తగ్గుతున్న ధరలు -నష్టాల్లో పౌల్ట్రీ రైతులు



ప్రజాశక్తి-మాడుగుల:పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర నష్టాల్లో కూరుకు పోయింది. గత కొద్ది నెలలుగా ధరలు పతనం కావడంతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు పెరుగుతుండగా దానికి తగ్గ ఆదాయం రావడం లేదు. ప్రస్తుతం బ్రాయలర్ కోడి కిలో లైవ్ ధర రూ.80లు వుంది. ట్రేడర్లు తరుగు పేరిట రూ.10 తీసేస్తే రైతుకు కిలో రూ.70లు మాత్రం అందుతుంది. ఒక కోడి కిలో బరువు అయ్యేందుకు దాణా, ఇతర ఖర్చులతో కలిపి రూ.90 నుండి 100ల వరకు ఖర్చు అవుతుండగా ఒక కోడితో రైతులకు కానీ, ఇంటిగ్రేషన్ చేసే వ్యాపారులకు కానీ కిలోకు రూ.20 నుండి 30ల

రూపాయల వరకు నష్టం వాటిల్లుతుంది. ఒక్క కోడి పిల్ల రూ.30 నుండి 45ల ధర వుంటుంది. దీంతో పాటు కోళ్ళు ఎదిగేందుకు ఊక, మందులు, విద్యుత్ చార్జీలు, మెంతులు, పెరుగు, బెల్లం, పంచదార, తమలపాకులు, వ్యాక్సిన్ కోసం కొన్ని వేల రూపాయలు ఖర్చు చేయాలి. దీంతో, పాటు పౌల్ట్రీలో పని చేసే కార్మికులకు ఒక బ్యాచ్‌కు కనీసం రూ.40 వేలు ఖర్చు అవుతుంది. పిల్లలు వచ్చిన దగ్గర నుండి సుమారు 45 రోజుల వరకు వాటి పనిలో నిమగ్నం అయి ఉండాలి. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో పక్క రైతులతో పాటు ఇంటిగ్రేషన్ చేసే వ్యాపారులు సైతం నష్టపోతున్నారు. మరో పక్క రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నా ఎఫ్‌సిఆర్ పేరిట ఒక బ్యాచ్‌కు 40 నుండి 50 వేల వరకు ఆదాయం గండి పడుతుంది.

కార్పొరేట్ల కంపెనీల మాయాజాలం

కార్తీక మాసంలో లేని ధరలు కూడా ప్రస్తుతం కొనసాగుతుండం వెనుక పౌల్ట్రీ కార్పొరేట్ కంపెనీల మాయాజాలం ఉన్నట్లు కనబడుతుంది. ఎప్పుడూ లేనంతగా చికెన్ ధరలు ఇలా పతనం కావడం వెనుక కార్పొరేట్ శక్తులు, ట్రేడర్ల గుత్తాధిపత్యం ప్రధాన కారణంగా కనబడుతుంది. గత నెలలో రూ.206 నుండి 250 రూపాయల వరకు రిటైల్ మార్కెట్లో కిలో చికెన్ లభించగా నేడు రూ.140 నుండి 160 వరకు విక్రయిస్తున్నారు. అకస్మాత్తుగా చికెన్ ధరలు పతనం కావడం వెనుక ఈ శక్తుల ప్రమేయం ఉన్నట్లు అర్థం అవుతుంది. ఈ ఫలితంగా లక్షలాది రూపాయలు వెచ్చించి షర్డు నిర్మించి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కోళ్ళ పెంపకం సాగిస్తున్న రైతులు లబోదిబో మంటున్నారు తీవ్ర నష్టాలు బారిన పడుతున్నారు. ప్రస్తుతం రైతుల కంటే ట్రేడర్లు, చికెన్ దుకాణాలు మాత్రమే లాభం పొందుతున్నారు. రానున్న మొదటి రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగితే కోళ్ల పరిశ్రమ పూర్తిగా సర్వనాశనం అవ్వడం ఖాయమని రైతులు వాపోతున్నారు. ఈ విషయం పట్ల ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్నారు


మెటీరియల్ ఇస్తున్న ఎంఇఒ

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్స్ పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కే.గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగం చుకోవాలని మానసిక ఎదుగుదలతో పాటు శారీరక ఎదుగుదల పొందాలని ఆయన సూచించారు.

'కాపు సేన ఇన్‌ఛార్జి'గా రాజా

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:కాపు సంక్షేమ సేన అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా యూత్ ఇన్చార్జిగా నర్సీపట్నంకు చెందిన మారిశెట్టి రాజాను రాష్ట్ర యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగొండి నాని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కాపు సంక్షేమ సేన మహిళా అధ్యక్షురాలు కళావతి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానన్నారు.

అధికారుల అత్యుత్సాహం

అల్లూరి విగ్రహానికి ముసుగు!

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నం నడిబొడ్డున రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి ఎదురుగా ప్రధాన రహదారి వద్ద ఉన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అధికారులు బుధవారం ముసుగు వేయడం అశ్చర్యాన్ని కలిగించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ముసుగు తొడిగారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలి. ఇలా స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు ముసుగులు వేయడం ఏమిటని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపులో శ్రద్ధ చూపని అధికారులు అల్లూరి విగ్రహానికి ముసుగు వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గొలుగొండ: అల్లూరి విగ్రహ ముఖ భాగానికి ముసుగు వేయడం సరికాదని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలు బాధ్యతను అధికారులు పట్టించుకోకుండా కిందిస్థాయి ఉద్యోగులకు అప్పగించడంతో ఇటువంటి దుశ్చర్య నెలకొందన్నారు. అధికారులు తొలుత గుర్తించలేదని, టీవీల్లో వచ్చేంతవరకు స్పందించలేదన్నారు.


ముసుగు వేసిన అల్లూరి విగ్రహం

శరవేగంగా కాలువల నిర్మాణం

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో వివిధ వార్డులలో శరవేగంగా కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు వచ్చిన విజ్ఞప్తులు మేరకు మోదమాంబ కాలనీ, గవర వీధి, అంబేద్కర్ కాలనీ, 4 వ వార్డు పరిధిలో పలు నిర్మాణాలు మొదలు అయ్యాయి. 4వ వార్డు పరిధిలో ముద్దంశెట్టి వెంకటరావు ఇంటి వద్ద నుండి నరసింహమూర్తి ఇంటి వరకు రహదారికి ఇరు వైపులా వార్డు సభ్యులు సమ్మంగి జగన్ అధ్వర్యంలో కాలువల నిర్మాణాలు పూర్తి అయ్యాయి.


నిర్మాణం చేపట్టిన కాలువ